ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 11.10.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. విద్యా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక మార్పులు తీసుకొస్తోందని, ఏఐ ఆధారిత పరిష్కారాలు విద్యార్థుల అభ్యాస ప్రక్రియను మెరుగుపరుస్తాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.

2. క్యాన్సర్‌పై సమష్టి పోరాటంతోనే విజయం సాధ్యమని మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ అన్నారు.

3. కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక న్యాయం, తెలంగాణలో బీజేపీకి మరో న్యాయమా అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

4. రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతోంది. నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉన్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

**రేవంత్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గోవా బయలుదేరి వెళ్లారు. గోవా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరుగుతున్న "గోయ్ రాఖోన్న యాత్ర"లో ఆయన ఈ సాయంత్రం పాల్గొననున్నారు. చీఫ్టెన్స్ స్మారకం నుంచి కున్కోలిమ్ బస్టాండ్ వరకు సాగే పాదయాత్రలో పాల్గొని, అనంతరం జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. రాత్రి గోవా నుంచి ఢిల్లీకి చేరుకుంటారు.

డెస్క్

-----------------------------

**శ్రీధర్ బాబు**

విద్యా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక మార్పులు తీసుకొస్తోందని, ఏఐ ఆధారిత పరిష్కారాలు విద్యార్థుల అభ్యాస ప్రక్రియను మెరుగుపరుస్తాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఎడ్యుటెక్ 2025 సర్వే ప్రకారం ఎడ్యుకేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్న పిల్లల్లో 77 శాతం మంది ప్రాక్టీస్, లెర్నింగ్ కోసం వినియోగిస్తున్నారని చెప్పారు. సంప్రదాయ విద్యా విధానాలకు సాంకేతికతను జోడిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని, విద్యా సంస్థల సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అందుబాటులోకి రావాలని సూచించారు. డేటా రక్షణ, గోప్యతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. డేటా సెంటర్ల ఏర్పాటులోనూ భద్రత, గోప్యత కీలకమన్నారు. ఈరోజు హైదరాబాద్ లో బ్రిలియన్ ఏఐ సాఫ్ట్ వేర్ సూట్ ను మంత్రి ప్రారంభించారు.

డెస్క్

-------------------------------

**క్యాన్సర్ రన్**

క్యాన్సర్‌పై సమష్టి పోరాటంతోనే విజయం సాధ్యమని మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ అన్నారు. గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన క్యాన్సర్ రన్‌ను వారు జెండా ఊపి ప్రారంభించారు. క్యాన్సర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా మంత్రులు పేర్కొన్నారు. దేశం నుంచి క్యాన్సర్‌ను తరిమివేసే మహా యజ్ఞంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

డెస్క్

--------------------------

**కిషన్ రెడ్డి**

కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక న్యాయం, తెలంగాణలో బీజేపీకి మరో న్యాయమా అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ద్వంద్వ విధానాలపై ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతల ధర్నాలు, నిరసనలకు పోలీసులు అవకాశం కల్పించారని, రాహుల్ గాంధీ స్వేచ్ఛగా సభలు నిర్వహిస్తున్నా అడ్డుకోలేదని గుర్తుచేశారు. కానీ తెలంగాణలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సహా నేతలను పదేపదే గృహనిర్బంధం చేస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రజాస్వామ్యాన్ని "మజిల్డ్ డెమోక్రసీ" అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

**డెస్క్**

-------------------------

**సీతక్క**

దక్షిణాఫ్రికా పర్యటనను ముగించుకుని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఈరోజు హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కాంగ్రెస్ శ్రేణులు, ములుగు జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి సత్కరించారు.

**డెస్క్**

------------------------------

**బీజేపీ**

బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన హైదరాబాద్‌లో రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ముఖ్య సమావేశం జరిగింది. ప్రజలచే ఎన్నికైన ప్రభుత్వ అధినేతగా, ముఖ్యమంత్రిగా, అనంతరం ప్రధానిగా నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నేతలు ఆయనకు అభినందనలు తెలిపారు. మోదీ అనుసరిస్తున్న 'నాగరిక్ దేవో భవ' సూత్రాన్ని కొనియాడారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి

కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ సహా పలువురు ఎంపీలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

డెస్క్

--------------------------------

**బండి సంజయ్**

కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో విజయ దశమి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. నవరాత్రుల తొలిరోజున అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి రూపంలో దర్శనమిస్తున్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాన్ని దర్శించుకున్న వేలాది మంది భక్తులు, భవానీ దీక్షాపరులకు ఆలయ నిర్వాహకులు మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందించారు.

**పీటీసీ – కరీంనగర్**

------------------------------

**కిషన్ సందర్శన**

సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా హైదరాబాద్ గన్‌ఫౌండ్రీలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సందర్శించారు. గడిచిన 25 ఏళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రధాని నరేంద్ర మోదీ నిస్వార్థంగా దేశానికి సేవ చేస్తున్నారని ఆయన అన్నారు. వైద్య సేవలను, పరీక్షలను పరిశీలించిన మంత్రి, రోగులతో మాట్లాడి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.  దేశ రక్షణ, ప్రజల సంక్షేమం కోసం మోదీ అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయన పనితీరును, క్రమశిక్షణను ప్రతి ఒక్కరూ తమ వృత్తులలో స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

డెస్క్

-------------------------------

**పొన్నం**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. ఓటు హక్కు కోల్పోయిన బాధితులను ఆధారాలతో సహా తీసుకొస్తానని, అందుకు తేదీ, సమయం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణపై జరుగుతున్న ఆందోళనలను తప్పుబడుతూ, ఓటు కోల్పోయిన వారెవరైనా ఉన్నారా అని రామచంద్రరావు ప్రశ్నించడం సరికాదన్నారు. "ఓటు బచావో – దేశ్ బచావో" నినాదంతో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

**డెస్క్**

----------------------------

**ఆది శ్రీనివాస్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటును గతంలో వ్యతిరేకించిన నాయకులే నేడు ఆవిర్భావ దినోత్సవాలు జరుపుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ విమర్శించారు. జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..... జిల్లా ఏర్పాటు కోసం ఉద్యమకారులు, వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాలు పోరాటం చేశాయని తెలిపారు.

**బైట్ – ఆది శ్రీనివాస్**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

---------------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతోంది. నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉన్నాయని, వాటి ఉపసంహరణ రేఖ తాండూరు, వికారాబాద్, హైదరాబాద్, జనగామ, భూపాలపల్లి మీదుగా కొనసాగుతోందని వాతావరణ కేంద్రం తెలిపింది. మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా 37 డిగ్రీల సెల్సియస్, పటాన్‌చెరులో అత్యల్పంగా 17.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ

నెల 1 నుంచి 11 వరకు రాష్ట్రంలో సగటున 0.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 99 శాతం తక్కువ. ఇప్పటివరకు 25 జిల్లాల్లో అసలు వర్షమే పడలేదు,

**పీఎస్**

--------------------------

**శరన్నవరాత్రి మహోత్సవాలు - వరంగల్**

హనుమకొండలోని చారిత్రక శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారి మూలమూర్తికి 21 కలశాలతో అభిషేకం నిర్వహించారు. శైలపుత్రి అలంకారంలో అమ్మవారు ఈరోజు భక్తులకు దర్శనమిచ్చారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నీలిమ దంపతులు ఉత్సవాలను ప్రారంభించగా, వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కుటుంబ సమేతంగా భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పీటీసీ – వరంగల్**

--------------------------------

**భద్రాద్రి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ నేరాల నియంత్రణ, అటవీ సంపద సంరక్షణకు ఫారెస్ట్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ తెలిపారు. అక్రమ కార్యకలాపాలను అరికట్టడంతో పాటు, అటవీ సంబంధిత ఫిర్యాదులు, సమాచారాన్ని సత్వరమే అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు.

**పీటీసీ - భద్రాద్రి కొత్తగూడెం**

--------------------------

**పల్లా రాజేశ్వర్ రెడ్డి**

జనగామ జిల్లా ఏర్పడి పది సంవత్సరాలు  పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ రోజు జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అనేక  అభివృద్ధి పనులను గత ప్రభుత్వంలో కేసీఆర్ నిర్వహించారని గుర్తుచేశారు.

**పీటీసీ – జనగామ**

--------------------------------

**రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా ఉద్యమ సాధన కమిటీ, వివిధ సంఘాల  ఆధ్వర్యంలో  దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళి అర్పించి, ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. ఈ  సమావేశంలో కరీంనగర్  మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ.... ఒకప్పుడు చేనేత కార్మికుల ఆత్మహత్యలతో ఉరిశాలగా పేరొందిన సిరిసిల్లను, సిరుల జిల్లాగా మార్చిన ఘనత మాజీ మంత్రి కేటీ రామారావుదే అన్నారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

--------------------------------

**టీబీ ముక్త్ గ్రామ పంచాయతీ**

సంగారెడ్డి నియోజకవర్గంలోని సైదాపూర్ గ్రామ పంచాయతీ టీబీ ముక్త్ గ్రామ పంచాయతీగా ఎంపిక కావడంపై ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.  గ్రామ సర్పంచ్ రాధిక రామగౌడ్ సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. గ్రామాన్ని టీబీ రహితంగా  తీర్చిదిద్దడంలో కృషి చేసిన పంచాయతీ పాలకవర్గం, ఆరోగ్య సిబ్బంది, సంబంధిత అధికారుల సేవలను ఎమ్మెల్యే ప్రశంసించారు.

**పీటీసీ - సంగారెడ్డి**

-----------------------------------

**కొనుగోలు కేంద్రాలు**

మహబూబాబాద్ జిల్లాలో వానాకాలం 2026 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న రకాల వడ్లను గుర్తించేందుకు సాంకేతిక నిపుణుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 230 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు నిర్ణయించగా, వీటిలో 199 కేంద్రాలను సన్న రకాల ధాన్యం కొనుగోలుకు కేటాయించినట్లు పేర్కొన్నారు.

**పీటీసీ - మహబూబాబాద్**

-----------------------------

**అథ్లెటిక్ ఛాంపియన్షిప్ పోటీలు**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాలలో రెండు రోజులపాటు ఆసిఫాబాద్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బిజెపి నాయకుడు కోవా విజయ్ నేతృత్వంలో జరిగే 12వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ ఛాంపియన్షిప్ 2026ను ఎంపీ గెడం నగేష్, జిల్లా కలెక్టర్ హరిత  ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి 1500 మందికి పైగా అథ్లెట్స్ రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనడం హర్షించదగ్గ విషయం అన్నారు.

**పీటీసీ – ఆసిఫాబాద్**

-----------------------

**మెదక్**

దసరా పండుగ సందర్భంగా నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మెదక్ జిల్లా ఎస్పీ  శ్రీనివాసరావు వెల్లడించారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లే ముందు తలుపులు, కిటికీలకు పటిష్టమైన తాళాలు వేయాలని, వెనుక తలుపులు, బాల్కనీలను కూడా తనిఖీ చేసుకోవాలని సూచించారు.

**పీటీసీ - మెదక్**

---------------------